చిక్కుల్లోపడ్డ చిన్నది

వాసవదత్త

ట్యాంక్ బండ్ మీద చల్లనిగాలి వీస్తోంది. అది సాయంత్రం ఎనిమిది గంటల సమయం.

ఆకాశం చిక్కని ఊదా రంగు పులుముకుంది. తేమగాలి తీవ్ర తరమయింది. ఇక కొద్ది సేపటిలో వాన వచ్చే సూచనలు ఉన్నాయి.

ట్యాంక్ బండ్ కి ఇరువైపులా ఉన్న మెర్క్యురీ లాంప్ లు జిగజిగ మెరుస్తూ, దూరం నుండి చూచేవారికి నల్లని ఆకాశంలో ముత్యాల వరస అనే భ్రాంతి కలుగచేస్తాయి.

రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. అల్లంత దూరం నుండి ఒక యువతి ఒగరుస్తూ వస్తోంది. ఆమె సికింద్రాబాద్ వైపు అతి వేగంగా వెళదామని ప్రయత్నిస్తోంది.

ఇంతలో వేగంగా వస్తూన్న కారుని చూసి తప్పుకుందా మని ప్రయత్నించి పేవ్ మెంట్ పైకి దూకింది. కాని కాలు అకస్మాత్తుగా జారడంచేత తూలి ముందుకి పడింది.

సరిగ్గా అదే సమయంలో కారు కీచుమంటూ ఆగింది.

కారులోనుండి ఒక ఆజానుబాహుడు క్రిందికి దిగాడు. అతని నోటిలో పైప్ ఉంది. బ్లూ కలర్ లాంగ్ కోట్, తల మీద ఈవెనింగ్ కాప్ ధరించే డతను. రిమ్ లెస్ కళ్ళద్దా లలోనుండి కాంతివంతమయిన కళ్లు మెరుస్తున్నాయి. వెండి రంగులో వున్న ముంగురులు కొద్దిగా నుదురుమీద పడుతు న్నాయి.

అతను ప్రొఫెసర్ వామ్. స్పెషల్ బ్రాంచ్ లో ఉన్న ‌అధికారంలో ఉన్న సైకాలజిస్ట్, క్రైమ్ డిటెక్షన్ లో స్పెషలిస్ట్.

"లోనికి రా అమ్మాయ్! ఎక్కడికి వెళ్ళాలి" అడిగా రాయన.

"అర్జంట్ గా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కి వెళ్ళాలి. ప్లీజ్, శ్రమ అని భావించకుంటే...?" అని ఆగిందా యువతి.

"నేను డ్రాప్ చేస్తాను. రా అమ్మాయ్," అన్నారు ప్రొఫెసర్ వామ్.

ఆమె కారు నధిరోహించింది.

కారు 'యు' టర్న్ తిరిగి సికింద్రాబాద్ వైపు తిరిగింది. కొద్దిదూరం ప్రయాణంచేసి, స్టేషన్ వైపు కాకుండా కంటోన్ మెంట్ వైపు మళ్ళింది కారు.

ఆ యువతి సీట్ కి చేరగిలి కిటికీలో నుంచి బయటికి చూస్తోంది.

"నీ పేరేమిటి అమ్మాయ్?" అడిగారు వామ్.

"మాలతి" జవా బిచ్చిందామె.

"నీది ఈ వూరు కాదమ్మాయ్," అన్నారు ప్రొఫెసర్.

ఆమె ఉలిక్కిపడింది. చక్కని ఆమె నేత్రాలు భయాన్ని సూచించేయి.

మాలతి మౌనాన్ని చూచి, ప్రొఫెసర్ మాట మార్చేరు.

"ఇంతకీ ఏ ఊరు వెళదామని?"

"బెంగుళూరు" అంది మాలతి.

"వాన్నగారేం చేస్తుంటారు?"

మాలతి మౌనంగా ఉండిపోయింది. వాన చినుకులు సన్నగా పడసాగేయి. కారు మరికొంత దూరం మౌనవాహినిలో ప్రయాణించింది.

"బెంగుళూరు వదిలి ఇక్కడికి ఎందుకు వచ్చేవో చెప్పలేదమ్మాయ్," అడిగేరు వామ్.

"కారు ఆపండి దిగిపోతాను," అంది మాలతి.

"చూడు మాలతీ. ఇంటివద్ద ఘర్షణపడి ఇక్కడికి హఠాత్తుగా వచ్చేవు. తిరిగి ఏదో బలమయిన కారణంవలన అంత హఠాత్తుగానే బెంగుళూరుకి పోవ నిశ్చయించేవు. కాని నీ చేతిలో పెట్టె, సామాను లేదు. కనీసం హేండ్ బాగ్ అయినా లేదు. డబ్బు లేకుండా ఎలా ప్రయాణం చేద్దామని నిశ్చయించేవు," అన్నారు వామ్.

"ఇంతకీ మీరెవరు?" అడిగింది.

"నన్ను ప్రొఫెసర్ వామ్ అంటారు. స్పెషల్ బ్రాంచ్‌లో సైకాలజిస్టని."

"నాది ఈ ఊరుకాదని ఎలా గ్రహించేరు?"

"సింపుల్. కారుని స్టేషన్ వైపుకి కాకుండా కంటోన్మెంట్‌కి మళ్ళించేను. అయినా నువ్వేమీ అనలేదు."

మాలతి మౌనంగా వాన చినుకుల్ని చూస్తూ ఊరుకుంది. ప్రొఫెసర్ ఒక చేతితో స్టీరింగ్ వీల్‌ని కంట్రోల్ చేస్తూ రెండవ చేతితో పైప్ పీల్చసాగేరు.

"ప్రొఫెసర్! నేను ఒక పెద్ద చిక్కులో పడ్డాను. మీకు

నా గురించి అంతా తెలియజేస్తాను. నన్ను ఆ చిక్కులో నుండి కాపాడి క్షేమంగా బెంగుళూర్ కి పంపే ఏర్పాట్లు చేస్తారా? మీ సహాయం ఎన్నటికీ మర్చిపోను,'' అంది మాలతి బేలగా.

ప్రొఫెసర్ అలాగే అన్నట్లు చిరునవ్వు నవ్వేరు.

అందమయిన ఆమె ముఖంలో దిగులు, ఆందోళన ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

మాలతిది సహజమైన అందం. ఆరంజ్ కలర్ చీర, అదే రంగు జాకెట్ ధరించిందామె. కాళ్ళకు ఆరంజ్ కలర్ స్లిప్పర్స్,వీటన్నిటితో మాచ్ అయేటట్లు తలలో కనకాంబరం పూలు ముడిచింది. పాలు, గులాబి రేకులు కలిపి మిళితం చేసి ఆ రంగుని దేహమంతటా అలదుకున్నట్లున్న ఆమె శరీర ఛాయ, చక్కని అంగసౌష్టవం ఆమె అందాన్ని ఇనుమడింప చేస్తున్నాయి.

''ఆరంజ్ కలర్ ని లైక్ చేసేవారు ఆడుతూ, పాడుతూ ఉత్సాహంగా వుంటారు. దిగులు పనికిరాదు మాలతీ,'' అన్నారు వామ్.

''అవును ప్రొఫెసర్. సరిగ్గా ఇరవై రోజుల క్రితం నేను చాలా ఆనందంగా వుండేదాన్ని. కాని అనుకోని పరిస్థితులు నా జీవితాన్ని కొత్తమలుపుకి తెచ్చేయి,'' అంటూ మాలతి తన గురించి చెప్పసాగింది.

2

సాయంత్రం ఆరయింది. తోటి స్టూడెండ్స్ అందరూ వెంటనే ప్రాక్టికల్స్ ముగించి ఇళ్ళకు వెళ్ళిపోయారు.అయినా మాలతి చేస్తున్న ఎక్స్ పెరిమెంట్ పూర్తి కాలేదు.

''మాలా నీ ఎక్స్ పెరిమెంట్ ఎంతవరకు వచ్చింది'' అడిగింది లేడీ లెక్చరర్.

"అయిపోవచ్చింది మేడమ్," అంటూ బున్సెన్ బర్నర్ మీద వేడిచేస్తున్న గాజు బీకర్‌ని కిందికి దించింది మాలతి.

బీకర్‌లోని ద్రవమంతా ఇగిరిపోయి రసాయనిక పదార్థమంతా క్రిస్టల్స్ బదులు నల్లని పేస్ట్‌గా మిగిలింది. మాలతి ఇటూ అటూ చూచింది. లెక్చరర్ అల్లంత దూరంలో వెను దిరిగి కూర్చుని వుంది. చటుక్కున తన బీకర్‌ని పక్క టేబుల్ మీద వుంచి, అక్కడ ఇంకొక స్టూడెంట్ తయారు చేసిన క్రిస్టల్స్‌ని తన వద్దకు లాక్కుంది.

"ఇదిగో మేడమ్. ఎంత పచ్చగా వచ్చాయో నా క్రిస్టల్స్" అంటూ చూపించింది.

"గుడ్. ఐడోఫామ్ క్రిస్టల్స్ అంటే అలా వుండాలి. లేట్ అయినా చక్కగా తయారుచేసేవు" అంది లెక్చరర్.

మాలతి నవ్వుకుంటూ కాలేజినుండి ఇంటికి బయులు దేరింది.

గేట్ వద్ద ఒక్క రిక్షాకూడా లేదు. హేండ్ బాగ్ ఊపు కుంటూ సన్నగా కూనిరాగం తీస్తూ నడవసాగింది మాలతి. సిటీబస్‌లుకూడా ఆ టైంకి వుండవు.

మాలతి రోడ్ మలుపు తిరిగింది.

ఎలక్ట్రిక్ స్తంభం క్రింద ఇద్దరు రౌడీలు కనిపించేరు. మాలతి తల వంచుకుని వారిని గమనించనట్లే పోసాగింది. ఒక రౌడీ ఈల వేసేడు. రెండవ రౌడీ మెడచుట్టూ వున్న రుమాలుని గిరగిరతిప్పుతూ మాలతి ముఖంమీద విసిరేడు.

"ఏయ్. ఎందుకా అమ్మాయి వెంటపడ్డారు" మాలతి తలెత్తి చూడగానే చకచక నడుస్తూ వస్తున్న యువకుడు కనిపించేడు.

"మిస్టర్ నీ దారిన నువ్వు పో. లేకపోతే" అంటూ బెద రించేడు రుమాలున్న రౌడీ.

అంతే. వాడి చెంప ఫెడీమంది. వాడు గింగిరాలు తిరు

గుతూ క్రిందపడ్డాడు. రెండవ రౌడీ చటాలున చాకు తీసి యువకుడిపైన దుమికేడు. యువకుడు అతని మణికట్టు పట్టుకుని వెనక్కి విరుస్తూ మోకాలిమీద తన్నేడు. వాడు చేతిలోని చాకుని విడిచి క్రింద కూలబడ్డాడు.

ఇంతలో మొదటి రౌడీ చేతికందిన రాయిని, రుమాల్లో చుట్టి రుమాలు రెండు కొసలు పట్టుకొని గిరగిర త్రిప్పి యువకుడి కణతమీద కొట్టబోయేడు. యువకుడు రౌడీ చేతిని అలాగే పుచ్చుకొని, బియ్యం బస్తాని ఎత్తినట్లు వాడిని వీపు మీదికి ఎత్తుకొని ముందుకి ఝూడించి క్రిందపడేశాడు.

ఆ జోడో ట్రిక్‌తో యుద్ధం పూర్తయింది. రౌడీలు దుమ్ము ములుపుకుంటూ దౌడు తీసేరు.

"సమయానికి వచ్చి హెల్ప్ చేసేరు. చాలా థాంక్స్," అంది మాలతి.

"దట్స్ నథింగ్. పదండి మిమ్మల్ని ఇంటివద్ద డ్రాప్ చేస్తాను," అన్నాడా యువకుడు.

తెల్లటి పాంట్ మీద, చారల షర్టుటక్ చేసేడతను. బ్లాక్ షూస్. సన్నగా చిరునవ్వు చిందించే ముఖం. నల్లని ఉంగరాల జుత్తుతో ఆకర్షవంతమయిన విగ్రహం.

మాలతి ఆతనితో ముందుకి నడిచింది. "పదండి. ఆ కనిపించే కార్ మనదే" అన్నాడతడు.

మాలతి తలెత్తి చూసింది.

అతడు నవ్వి, "ఊఁ. పదండి. అడ్రెస్ చెప్పండి. మిమ్మల్ని దించుతాను," అన్నాడు.

మాలతి నవ్వి కార్‌లో కూర్చుంది.

"మీ పేరు" అడిగాడు అతను కారెక్కుతూ.

చెప్పింది మాలతి.

"వెరీ నైస్ నేమ్. నా పేరు శ్రీనివాస్" అన్నాడతను.

నైస్ నేమ్ అనుకుంది మాలతి.

ఇల్లుదగ్గరకు రాగానే ఆపమంది మాలతి. అతను ఆపేడు.

మాలతి కారుదిగి, "చాలా థాంక్స్. రేపొకసారి రండి. మా ఫాదర్‌ని పరిచయం చేస్తాను," అంది.

"అలాగే" అన్నాడు శ్రీనివాస్ కార్ స్టార్ట్ చేస్తూ.

"చూడండి మిస్టర్" అంది మాలతి.

శ్రీనివాస్ ఆగిపోయేడు.

"ఆ కార్‌ని వదిలి వెళ్ళండి."

"ఓ యస్. రేపు రానని అనుమానమైతే అలాగే వదిలి వెళ్తాను. రేపు వచ్చి తీసుకెళ్తాను. కావాలంటే రేపు మిమ్మల్ని కాలేజి దగ్గర డ్రాప్ చేస్తాను" అన్నాడు శ్రీనివాస్.

"అలాగే డ్రాప్ చేద్దురుగాని. ఎందుకంటే ఆ కారు మాదే. కార్‌ని ఎక్కడినుండి తెచ్చారో ఆ ఆఫీస్ మా నాన్నగారిది" అంది మాలతి నవ్వు కనపడకుండా పెదిమలు బిగించుతూ.

"ఓ. ఐసీ. అలాగా!" కార్‌లోంచి క్రిందకు దూకేడు శ్రీనివాస్.

"ఇలా ఇంట్లోకి రండి," నవ్వుతూ ఆహ్వానించింది మాలతి.

అతడు సందేహిస్తూ అడుగుపెట్టేడు.

"ఊం. రండి. కాఫీ తీసుకుని వెళుదురుగాని," అంది మాలతి.

అతడు సందేహంగా "చూడండి. మీ...మీ నాన్నగారు కొంపదీసి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్నారా," అడిగేడు.

మాలతి ఫకాలున నవ్వేసింది.

"మీకా భయం అక్కరలేదు. మా నాన్నగారు ఎల్. ఐ. సి. ఆఫీసులో మానేజర్" అంది మాలతి.

కాఫీ తాగుతూ ఉండగా అడిగింది "మీరేం చేస్తున్నారు" అని.

"నేనా? ప్రస్తుతం రోడ్లు సర్వే చేస్తున్నాను. అన్ని ఆఫీసులకి అప్లికేషన్లు పడేసేను. జాబ్ ఏదయినా దొరకుతూందేమోనని కాచుకుని ఉన్నాను," అన్నాడు శ్రీనివాస్.

మాలతి ఆలోచించింది.

"మీరు రేపు సర్టిఫికెట్స్ తీసుకుని మా ఇంటికి రండి. మా ఫాదర్‌కి చెప్పి మా ఆఫీస్‌లో ట్రై చేస్తాను. ఏం?" అంది.

శ్రీనివాస్ ముఖం విప్పారింది.

మర్నాడు ఉదయం తొమ్మిది గంటలయే సరికల్లా శ్రీనివాస్ డ్రాయింగ్ రూమ్‌లో వున్నాడు. మాలతి నాన్నగారు పార్వతీశంగారు సర్టిఫికేట్స్ పరిశీలించి సంతృప్తికరంగా తలూపేరు. అంతే అదేరోజునుండి శ్రీనివాస్ అకౌంటెంట్‌గా జాయినయ్యేడు.

ఆ రోజు సాయంత్రం కాలేజ్ గేట్ వద్ద కార్‌తో సహా హాజరయ్యేడు. మాలతి అతన్ని చూసి నవ్వుతూ పలకరించింది.

"అన్నమాట ప్రకారం వచ్చారే" అంటూ.

"మరి మన మాటంటే ఏమిటనుకున్నారు. ముందు ఈ స్వీట్స్ తినండి" అన్నాడు శ్రీనివాస్ స్వీట్స్ పాకెట్ ఇస్తూ.

ఆ రోజు సాయంత్రం రూఫ్ గార్డెన్‌లో పార్టీ ఇచ్చేడు శ్రీనివాస్.

ఆ మర్నాడు మధ్యాహ్నం ఆఫీస్‌లో పార్వతీశంగారి ప్రమోషన్ సందర్భంగా పార్టీ జరిగింది. ఆఫీస్‌కి మాలతి, తల్లి, చిన్న చెల్లెలు లావణ్య వెళ్ళేరు. శ్రీనివాస్ వారికి ఆఫీసు అంతా చూపించేడు. ఏడు అంతస్తులూ దిగి వచ్చే

సరికి "ఇక నేను నడవలేను బాబూ" అంది మాలతి కూలబడుతూ.

"ఉండండి. డ్రింక్స్ తెస్తాను"

శ్రీనివాస్ బయటికి వెళ్ళేడు. ఆ రోజు ప్రోగ్రామ్‌లో వచ్చే వారిని రిసీవ్ చేసుకునే బాధ్యత అతనిమీద పడింది. కొత్తగా అపాయింట్ అయినందువలన అందరి మెప్పు సంపాదించాలని అతను కూడా ప్రతిపనిలో ఇంటరెస్టు తీసుకుని చేసేడు.

డ్రింక్స్ తెచ్చి అందరికి ఇచ్చేడు.

మాలతి ఆరంజ్ జ్యూస్ సిప్ చేసి "లావణ్యా ఇక్కడే ఉండాలి. ఏమయింది" అంది చుట్టూ చూస్తూ.

"నే నిందులో ఉన్నాను" అంటూ సన్నగా విన వచ్చింది లావణ్య కంఠధ్వని.

"ఏదీ కనిపించదే" అంది మాలతి తల్లి.

శ్రీనివాస్ చుట్టూరా చూసేడు. ఆ రోజే ఆఫీస్ కొత్త ఐరన్ సేఫ్ తెచ్చేరు. బహుశా...ఐరన్ సేఫ్ మూత లాగేడు. కాని అది ఊడిరాలేదు.

లావణ్య అందులో ఉండిపోయింది.

శ్రీనివాస్ ముఖాన్ని చెమటలు కమ్ముకున్నాయి.

ఆ సేఫ్ ఆటోమేటిక్ మెకానిజమ్ గలది.

కాంబినేషన్ తెలిస్తేనేగాని తియ్యడం ఎవరితరమూ కాదు.

పార్వతీశంగారు హడావిడిగా సేఫ్ తెచ్చిన కంపెనీకి ఫోన్ చేసేరు. కంపెనీ మెకానిక్ ఊళ్ళో లేడుట.

మెకానిక్ వచ్చేసరికి కనీసం పది పన్నెండు గంటలవు తుంది. మరి అంతవరకూ లావణ్యకు ఊపిరాడేందుకు గాలి ఉంటుందా?

సేఫ్ లోనుండి లావణ్య గొంతు పెడుతోంది. మాలతి పెదవులు అదరసాగేయి. ఆమె దిక్కుతోచక శ్రీనివాస్ వైపు ప్రాధేయపూర్వకంగా చూసింది.

శ్రీనివాస్ నిబ్బరంగా ఆమె భుజం తట్టి ఫోన్ చేశాడు.

పది నిముషాల్లో ఎవరో వ్యక్తి ఒక బేగ్ తెచ్చి శ్రీనివాస్ కి అందించేడు.

శ్రీనివాస్ బైవిప్పి, బేగ్ లోని పనిముట్లతో సేఫ్ తో కుస్తీ పట్టసాగేడు.

అయిదు నిముషాలయింది... శ్రీనివాస్ షర్ట్ చెమటతో నిండిపోయింది. కాని సేఫ్ హేండిల్ ఇసుమంతయినా కదలలేదు. లావణ్య కేకలు వినిపిస్తూనే వున్నాయి.

పది నిముషాలయింది.... శ్రీనివాస్ ముఖంనుండి చెమట ధారలుగా కారసాగింది.

లావణ్యకి ఓపిక లేక ఉండి ఉండి శ్వాస తీసుకుంటూ బలహీనంగా అరుస్తోంది.

వాచ్ లో ముల్లు తిరుగుతున్నాయి...

పదిహేను నిముషాలయ్యేయి ... లావణ్య ఏడుపుమాని వెక్కుతోంది.

ఇరవై నిముషాలయ్యేయి...లావణ్య ఏడుపు వినిపించటం లేదు. శ్రీనివాస్ తదేకధ్యానంగా హేండిల్ అడుగున ఉన్న కన్నంలో పనిముట్లు త్రిప్పి కాంబినేషన్ నంబర్ కై కుస్తీ పట్టుతున్నాడు...క్లిక్... సేఫ్ తెరుచుకొంది.

శ్రీనివాస్, లావణ్యని చేతుల్లోకి తీసుకుని ఆర్టిఫిషియల్ రెస్పిరేషన్ వచ్చేందుకు చికిత్స చేసేడు.

లావణ్య కళ్లు నెమ్మదిగా తెరుచుకున్నాయి.

తల్లి, తండ్రుల ఆనందం ఇంతా అంతాకాదు. మాలతి కళ్ళు శ్రీనివాస్ ముఖంపైన నిలిచేయి.

ఆ రోజు సాయంత్రం పార్వతీశంగారు శ్రీనివాస్ ని

డిన్నర్ కి పిలిచేరు.

డిన్నర్ అయిన తర్వాత మాలతి, శ్రీనివాస్ లు గార్డెన్ వైపు నడిచేరు. లావణ్య వారి చేతులు పట్టుకుని నడుస్తోంది.

"శ్రీనివాస్! మీ నాన్నగారెక్కడున్నారు?" అడిగింది మాలతి.

"వారెప్పుడో పోయేరు" అన్నాడు శ్రీనివాస్.

"మీ యింటికి ఒకసారి వెడదామా?"

శ్రీనివాస్ ముఖంలో ఆందోళన కనిపించింది.

"ఈ రోజు వద్దు మాలతీ, మరెప్పుడయినా తీసుకెళతాను."

మాలతి ఇంకేమీ అడగలేదు.

ఇద్దరూ చెట్టాపట్టాలేసుకుంటూ ఇంటిదోవపట్టారు.

గార్డెన్ గేట్ వద్ద చారలబనీన్ వాడు వీరిని చూసి అదోలా నవ్వేడు.

"శ్రీనివాస్! వాడు...ఆ రోజు తన్నులుతిన్న రౌడీల్లో ఒకడు కదూ?" అడిగింది.

"అవును– వాడికింకా బుద్ధిరాలేదు"శ్రీనివాస్ అన్నాడు పళ్లు కొరుకుతూ.

రాత్రి మాలతి ఊహాలోకాల్లో తేలుతూ కళ్ళు మూసుకొంది.

'చక్కని పేరు– అందమైన రూపం' అనుకుంది.

మర్నాడు కాలేజీకి సెలవు. మధ్యాహ్నం ఒంటిగంటయింది. ఫోన్ ట్రింగ్...ట్రింగ్ మంటూ మోగింది. మాలతి ఛెంగుమంటూ వెళ్ళి అందుకుంది, శ్రీనివాస్ ఫోన్ చేసి ఉంటాడు అనుకుంటూ.

కాని ఫోన్ చేసింది పార్వతీశంగారు.

"మాలతీ, శ్రీనివాస్ ఇంటికి వచ్చేడా?"

"లేదు డాడీ" చెప్పింది మాలతి.

"నాకు అతనిమీద అనుమానంగా ఉంది మాలా. ఆఫీస్ సేఫ్‌లోనుండి పదివేలరూపాయలు మాయమయ్యాయి. శ్రీనివాస్ కూడా లేడు. అతను నీ దగ్గరికి వస్తే మాటల్లోకి దింపి ఉంచు, నేను పోలీసుల్తో వస్తాను."

ఫోన్ దించేసింది మాలతి.

ఆమె గుండెలు బాధతో అదురుతున్నాయి.

శ్రీనివాస్ దొంగ అంటే తను నమ్మలేకపోతోంది.

ఆ రోజు తనను రౌడీలబారినుండి రక్షించేడు. అతని ముఖం చూస్తే గొప్పింటి బిడ్డలా ఉన్నాడు. ఆ రోజు లావణ్య సేఫ్‌లో ఇరుక్కుపోతే తీసేడు ... శ్రీనివాస్ సేఫ్‌ని తెరవగలిగేడు...ఇరవై నిముషాల్లో ఐరన్ సేఫ్‌ని తెరిచేడు. మాలతి గుండెలు బరువెక్కాయి. సేఫ్‌ని తెరిచేందుకు పనిముట్లు తెచ్చినవాడ్ని ఎక్కడో చూసినట్లు జ్ఞాపకం రాసాగింది...అతడు మరెవడో కాదు. శ్రీనివాస్ చేత తన్నులు తిన్న మొదటిరౌడీ...కొద్దిగా రూపం మార్చుకుని రావటంవల్ల తను అప్పుడు గుర్తించలేదు. నిన్న గార్డెన్ వద్ద కనిపించిన రెండవరౌడీ శ్రీనివాస్‌ను చూసి నవ్వేడు... మాలతి నమ్మలేకపోతోంది.

శ్రీనివాస్ కూడా రౌడీల్లో ఒకడు.

3

తల ఆలోచనల్తో పగిలిపోతోంది. కళ్ళనిండా నీళ్ళు నిండి ఏదీ కనబడడంలేదు. పెదిమల్ని బిగించి చేతికందిన బట్టల్ని సూట్‌కేస్‌లో పడేసి టాక్సీని తెమ్మని నౌకరికి చెప్పింది.

తనకోసం శ్రీనివాస్ వస్తే పొమ్మని చెప్పమని నౌకర్‌కి పురమాయించింది. తన చేతుల్తో తాను శ్రీనివాస్‌ని పోలీసులకి అప్పగించలేదు.

ఆ రోజే మాలతి హైదరాబాదులో అడుగు పెట్టింది.

మర్నాటి సాయంత్రం బంజారాహిల్స్ వైపు అలా తిరుగుతూ వెళ్ళింది. ఎంతసేపు తలచినా శ్రీనివాస్ దొంగ అంటే తను నమ్మలేకపోతోంది.

కారు హారన్ చెవిపక్కనే వినిపించడంతో చటుక్కున తిరిగి చూచింది మాలతి.

కారులో ఉన్న యువతి మాలతిని చూసి నవ్వింది.

"వాంట్ లిఫ్ట్?" అడిగిందామె.

మాలతి కృతజ్ఞత చెప్పి కారెక్కింది.

"మీ పేరేమిటి?" అడిగిందామె. మాలతి చెప్పింది. తన పేరు భారతి అని చెప్పిందా యువతి.

కారు శర వేగంగా తోలుతోందా యువతి. మాలతి బాహ్యలోకాన్ని మరచి ఆలోచనలో మునిగిపోయింది.

ఆ యువతి పిచ్చిదానిలా స్టీరింగ్ వీల్ని ఇటూ, అటూ త్రిప్పుతూ స్పీడుగా తోలుతోంది. కారు కొండల్లో మెలికలు తిరుగుతోంది

"......ఎవర్నీ నమ్మకూడదు. అందులో డబ్బు ఉన్నవారిని అసలే నమ్మకూడదు- వింటున్నారా..." గొణుగుతున్నదా యువతి.

మాలతి ఆలోచనలన్నీ శ్రీనివాస్ చుట్టూ తిరుగుతున్నాయి.

"...ఆనంద్ పెళ్ళిచేసుకుంటాడని అనుకున్నాను... కాని మోసపోయింది నేనే."

మాలతి ఆలోచనలు ఆ యువతి మీదికి తిరిగేయి. ఆమె చెప్పేదంతా వినసాగింది.

"...ఆనంద్ తండ్రి తెగతెంపులు చేసుకోమన్నాడు. ఆనంద్ని మరచిపొమ్మని నాకు డబ్బాశ చూపించేడు. అన్నింటిని డబ్బుతో కొనగలమనుకునే ధనమదాంధుడు అతనితండ్రి.

నా ఉద్యోగాన్ని తీసివేయించేడు. గత్యంతరంలేక అత్త నిచ్చిన అయిదు వేలూ పుచ్చుకుని ఇలా లోకంమీద పడ్డాను."

మాలతి ఆశ్చర్యంగా చూసిందా యువతిని. సీట్ మీద ఉన్న హేండ్ బేగ్ లో వందరూపాయలనోట్ల కట్ట వుంది. సగం తెరిచిన జిప్ లోనుండి బయటికి కనిపిస్తోంది.

"మరి కారెవరిది?" అడిగింది మాలతి.

"ఇంకెవరిది ఆనంద్ ది_ పిచ్చివాడు ఆనంద్. లోకాన్నుండి దూరంగా పోయే నాకో కారు ఇచ్చి పంపేడు."

మాలతికి కంగారు ప్రారంభమయింది.

"ఏమిటి నువ్వు మాట్లాడేది?"

"ఏంలేదు_ స్లీపింగ్ పిల్స్ ఓ ఇరవై తిన్నాను. ఇక ఈ డబ్బు, కారు ఏమయినా నాకో ఖాతరు లేదు" వెకిలిగా నవ్విందామె.

కారు లోయలో మెలికలు తిరుగుతోంది. మాలతి తలుపు తెరిచి దూకడానికి ప్రయత్నం చేసింది. ఆ యువతి కళ్లు భారంగా మూతలు పడుతున్నాయి.

ఉన్నట్టుండి స్టీరింగ్ వీల్ మీదనుండి ఆమె చేతులు జారేయి. మాలతి ఆమెని తప్పించి స్టీరింగ్ వీల్ ని అందుకుంది.

కాని అప్పటికే కారు 40 అడుగుల లోతున్న లోయలోకి జారింది...ధన్...పెద్దగా కుదుపు ... ప్రేలుడు... మాలతి తలుపు తెరుచుకుని బయటపడింది. నాలుగడుగులు వేసి నేలకి ఒరిగింది. ఇక ఆమెకి ఏమి జరిగింది తెలియదు...

అలా ఎన్ని గంటలసేపు స్పృహతప్పి ఉందో ఆమెకే తెలియదు. కళ్లు తెరిచేసరికి రాత్రి తొమ్మిదయింది. కారు చాలావరకు కాలిపోయింది. ఆ యువతి ముఖం గుర్తుతెలియకుండా నల్లగా మాడిపోయింది. మాలతి కారు తలుపు తీసి

చూసింది. తన హేండ్ బాగ్ ఏమైందో తెలీదు. ఆ యువతి హేండ్ బాగ్ మాత్రం ఎగిరి అల్లంత దూరాన పడి ఉంది. మంటలు ఆ బాగ్ ని తాకలేదు.

మాలతి బాగ్ తెరిచి చూసింది. అయిదువేల రూపాయలు. ఒక ఉత్తరాల కట్టమాత్రం ఉన్నాయి. ఉత్తరాల కట్ట విప్పి చూసింది. ఉత్తరాల చివర ఆనంద్ సిన్హా అని సంతకం ఉంది.

మాలతికి ఒక ఆలోచన తట్టింది. చనిపోయిన యువతి పేర తను చలామణీ కాగలితే? పోలీసుల దృష్టిలో చని పోయినది మాలతి అవుతుంది.

మాలతి ఆ రోజునుండి భారతిగా మారింది. తిరిగి ఇంటికి వెళ్ళదలచుకోలేదు. వారం రోజులవుతోంది ఇల్లువదలి.

భారతిగా రెండు రోజులు మాత్రం చీకూ, చింతా లేకుండా గడిపింది. నాంపల్లి వెనుక ఉన్న చిన్న ఇళ్ళలో ఒక గది అద్దెకు తీసుకుంది. దగ్గరలో ఉన్న బిస్కెట్ ఫాక్టరీలో టైపిస్టు ఉద్యోగం సంపాదించింది. సర్టిఫికేట్లు పోగొట్టుకుందనీ, కొద్ది రోజుల్లో డూప్లికేట్లు తెస్తానని కంపెనీవారికి నచ్చచెప్పింది.

జీతం నూట ఇరవై.

ఆ హాయి అట్టే నిలువలేదు.

సాయంత్రం ఇంటికి వచ్చిబట్టలు మార్చుకుని మంచంమీద వాలింది. బయట కాకులు అరుస్తున్నాయి. రిక్షాలు, సైకిళ్ళు చేసే శబ్దం వినిపిస్తోంది.

ఎవరో తలుపు తట్టారు.

తన తలుపు కాదేమో అని ఊరుకుంది మాలతి. ఇందాక మెట్లుమీద శబ్దం అయినప్పుడే వింది. ఈసారి తీరా తలుపు తట్టిన శబ్దం అయింది. తలుపు తెరిచింది మాలతి.

గారపళ్ళు ఇకిలించి నవ్వుతున్నాడు అతను.

"నేను ఇన్సూరెన్స్ ఏజన్సీ తరపున ఇన్వెస్టిగేటర్ని" అన్నాడతను.

"మీ కేవరు కావాలి?" అడిగింది.

"భారతి కారు ఏక్సిడెంట్ లో చనిపోయింది. ఆమెతో ప్రయాణం చేసినవారు మీరని తెలిసి వచ్చాను."

"చనిపోయింది మాలతి. మీరు పొరబడ్డారు" మాలతి అంది.

అతడు నవ్వాడు. తల అడ్డంగా తాటించేడు_ "పొర బడింది మీరు. మీ హేండ్ బాగ్ నా కంటపడింది. భారతి హేండ్ బాగ్ మాయమయింది. చనిపోయిన సమయానికి భారతి బేగ్ లో అయిదు వేలరూపాయలు, కొన్ని ఉత్తరాలు ఉండాలి. అవి మాయమయ్యేయి" అన్నాడు.

"అయితే నా దగ్గరకు రావటంలో మీ ఉద్దేశ్యం?"

"నాకా ఉత్తరాలు కావాలి. అనుమానం నీ మీదకు రాకుండా వుండాలంటే అయిదువేల రూపాయలిస్తే చాలు. నా దారిన నేను పోతాను."

"నన్నెవరు అనుమానిస్తారు?"

"చనిపోయిన భారతి రెండు మాసాల గర్భిణి. ఆమెను కారులోతోసి హత్య చేసి అయిదువేలు కాజేసిన నేరం నీ మీద వస్తుంది. తర్వాత నీ ఇష్టం. రాత్రి పదిగంటలక నేను వస్తాను. నేను చెప్పినవి రెడీగా ఉంచండి."

అతడు వెళ్ళిపోయేడు. వెళ్తూ తన కార్డు ఇచ్చి వెళ్ళేడు. పేరు నాగభూషణం.

మాలతి అడుగులు భారంగా వేసుకుంటూ బట్టలు కట్టుకుని భోజనం చెయ్యడానికి హోటల్ కి వెళ్ళింది. సరిగ్గా భోజనం చెయ్యలేకపోయింది.

తిరిగి అరగంట తర్వాత ఇంటికి చేరుకుంది. మెట్లెక్కు తూండగా ఎవరో తన పక్కగా తెల్ల దుస్తుల్లో వెళ్ళినట్లు

లీలగా కనిపించింది. మాలతి ఇదేమీ గమనించే స్థితిలో లేదు. మెల్లెక్కి తలుపు తెరిచింది. లోన అంతా అంధకారంగా ఉంది. క్రింద వీధిలో కారు హారన్ మ్రోగింది.

మాలతికి అనుమానం కలుగుతోంది. తాను లైటు ఆర్పి క్రిందికి పోలేదు. మరి తను లేని సమయంలో లైటు ఆర్పి వేసింది ఎవరు?

గదిలో ఎవరో కదిలిన అలికిడి అయింది. ఎవరో ఆమెని తాకుతూ గుమ్మం వైపుకి నడిచేరు.

మాలతి కెవ్వున అరిచి లైట్ వేసేందుకు గోడను వెదికింది. స్విచ్ కి బదులు బాకుపిడి తగిలింది. గోడకి వేలాడు పిడిబాకుల్లో ఒకటి అది. మాలతి ఆలోచించకుండా బాకుని తీసి ఆగంతకుడివైపు విసిరింది. అతడు ఆహ్ అంటూ మూల్గి మాయమయ్యేడు.

మాలతి మెట్లు దిగి గబగబా వీధిలోకి అడుగుపెట్టింది. ఎవరూ లేరు. నల్లని అంబాసిడర్ కారు సందు మలుపు తిరుగుతోంది. నెంబరు MYR 97.. చివరి రెండు అంకెలు కనిపించలేదు.

మాలతి పోలీసులకు ఫోన్ చేసి గదికి తిరిగి వచ్చింది.

గది అంతటా చిందరవందరగా ఉంది. ఎవరో అప్పుడే హడావిడిగా వెదికేరు. గది గుమ్మంవద్ద రక్తపు చినుకులు ఉన్నాయి. మెట్లమీద రక్తం ధారగా కారింది. మాలతి రక్తధార ననుసరిస్తూ క్రిందికి వచ్చింది. మెట్ల అడుగున నల్లని మూట ఏదో ఉంది. దగ్గరికి వెళ్ళి పరిశీలించింది. అది మూటకాదు నాగభూషణం అతను. గుండెల్లో పిడిబాకు ఉంది. మాలతి వర్షాన్ని లెక్కచేయకుండా రోడ్డునబడి పరుగెత్తసాగింది. దూరంగా పోలీస్ వాన్ వస్తున్న సైరన్ వినిపించింది.

4

కారు వెనక్కి మళ్ళించి నాంపల్లి వైపు పోనిచ్చేరు ప్రొఫెసర్ వామ్. మాలతి విండోగుండా బయటికి చూస్తోంది. వాన తీవ్రంగా పడుతోంది.

"నాగభూషణం మరణించేడా?"

"లేదు. మూలుగుతున్నాడు. ఇక అట్టేసేపు బ్రతకడని భావించి వచ్చేసేను," మాలతి అంది.

ప్రొఫెసర్ మౌనంగా కారు నడిపించసాగేరు.

"హత్య చేసింది నేనే నంటారా? అతన్ని గుండెల్లో పొడిచినట్లు జ్ఞాపకంలేదు. బాకు అతని చేతికి గుచ్చుకుం దేమో అనుకున్నాను."

కారు నాంపల్లి చేరింది.

మాలతి ఇల్లుకి దారి చూపించింది. కారు మధ్యదారిలో ఆపి ప్రొఫెసర్ ఎవరికో ఫోన్ చేసేరు. తిరిగి కారు నడిపించి ఇంటికి పోనిచ్చేరు. కారు ఇంటిముంగిట ఆగింది.

మాలతి భావించిన విధంగా పోలీసులు లేరు. ఇల్లు నిర్మానుష్యంగా ఉంది. వాన తగ్గు ముఖం పట్టింది. తుంపర మినహా మరేమీ లేదు.

మాలతి కారు దిగి మెట్లెక్కింది.

వామ్ కారుని ఒకపక్క నిలిపి ఇంటి ముంగిట వంగి పరిశీలించేరు. కారు టైర గుర్తులు ఉన్నాయి.

గుమ్మంలోకి అడుగుపెడుతూ తలెత్తి చూసేరు. మేడ పైన పైప్ లోనుండి వాన నీరు చుక్కలు చుక్కలుగా పడుతోంది. కర్చీఫ్‌తో ముఖంమీద పడిన నీటి చుక్కల్ని తుడుచుకుని మెట్లెక్కేడు.

మెట్లమీద రక్తపు బొట్లు ఉన్నాయి. మెట్ల దిగువ శవం లేదు.

వామ్ మెట్ల పక్కనే ఉన్న ఇనుప బద్దీ కంటుకుని

ఉన్న దారంపోగుని తీసి కాగితంలో చుట్టి జేబులో వేసు కున్నారు.

మాలతి గుమ్మంముందు కొన్ని అడుగుజాడలు ఉన్నాయి. వామ్ వంగి చూసేరు. గుమ్మం ముందున్న నుసిని రెండు వేర్వేరు కాగితాలలోకి ఎత్తి భద్రపరిచేరు.

"ఇక మనం గదిలోకి వెళ్ళి మాట్లాడుకోవచ్చు. ఇక బయట పరిశీలించేదేమీ లేదు" అన్నారు.

మాలతి స్విచ్ వేసింది. మాలతి చెప్పిన విధంగా గదం తటా సామానులు చెల్లా చెదరుగా ఉన్నాయి. స్విచ్ పక్కనే తోలుపటకా వేలాడుతోంది. తోలు పటకా చెరో పక్కన బాకులు పెట్టుకునే ఒరలు ఉన్నాయి.

"అందులో వుండే బాకునే నేను నాగభూషణంపైన విసి రేను," అంది మాలతి.

"అతను నాగభూషణమే అని నీకెలా తెలుసు?" అడి గాడు ప్రొఫెసర్.

"అతను... నాగభూషణమే అయివుండాలి... ఉత్తరాల కోసం వస్తానని చెప్పేడు."

"ఆ ఉత్తరాలేవీ?"

మాలతి వంటింటిలోకి వెళ్ళి జాడీలమాటున దాచిన ఉత్త రాల్ని తెచ్చి ప్రొఫెసర్‌కి ఇచ్చింది.

ప్రొఫెసర్ ఉత్తరాలకట్టని జేబులో పెట్టుకుని "ఈ తోలు పటకానికి ఒకటే బాకు ఉండేదా? లేక రెండు ఉన్నాయా?" అన్నారు.

మాలతి ఆలోచించింది.

"ఒకటే ఉందని అనుకుంటున్నాను. ఆ ఒక్కటే నేను ఉపయోగించేను."

వామ్ పటకాని కొక్కంనుండి తొలగించి చూసేరు.

"ఏ పక్క బాకుని ఉపయోగించావు?"

"కుడిచేతి పక్క ఉన్న ఒరలోనుండి బాకుని తీసేను" చెప్పింది.

"ఎడమచేతి వైపు కూడా బాకు ఉండాలి" అన్నారు వామ్.

"అవును ఉండి ఉండాలి. కాని నేను చూసేసరికి ఒకటే ఉంది."

"అంతకు ముందు ఎన్నడయినా బాకుల్ని చూసేవా?"

"లేదు."

"ఎన్ని రోజులనుండి గదిలో అద్దెకుంటున్నావు?"

"వారం రోజులయింది!"

"వారం రోజులకుముందు రెండవబాకు మాయమయింది అని భావిద్దాము. అయినచో ఎడమచేతి ఒరలో ధూళి ఉండాలి. కాని రెండు ఒరలలో ధూళిలేదు. అంటే అవి కొద్ది నిముషాల తేడాతో తియ్యబడ్డాయి" అన్నారు వామ్.

తిరిగి తోలు పటకాని కొక్కానికి తగిలించేరు.

గదిలో ఒక కుక్కిమంచం, రెండు టేబుల్స్, ఒక పాత బీరువా ఉన్నాయి. ఒక టేబుల్ కిటికీకి దిగువ ఉంది. రెండవ టేబుల్ గదిమధ్యలో ఉంది. రెండవ టేబుల్ మీద ఇస్త్రీ బట్టలు ఉన్నాయి. ఒక తెల్లచీర, ఓ నల్లచీర, నాలుగు జాకెట్లు మాత్రమే ఉన్నాయి.

టేబుల్ క్రింద ట్రంక్ పెట్టె ఖాళీగా పడి ఉంది. పెట్టెలో ఒకమూల అయిదువేల నోట్లకట్ట అలాగే ఉంది.

గదిలో వెచ్చగా ఉంది. ప్రొఫెసర్ కిటికీవద్ద నిలబడి చేతులు టేబుల్ మీద ఆన్చి బయటకు తొంగిచూసేరు. బయటవాన ధారలుగా పడుతోంది. లైట్ల కాంతిలో వాన ధారలు జలతారుతీగల్లా కనబడుతున్నాయి.

"మెట్లు ఎక్కుతుండగా కారు హారన్ వినిపించింది అన్నావు. కారునెంబరు MYR 97... అని చెప్పేవు.

ఆ కారులో వచ్చిన వ్యక్తి గదిలోకి వచ్చేడంటావా?”
అడిగారు వామ్.

మాలతి తలాడించింది.

“ఆకారు ఎవరిదో తెలిసికోనడం ఎలా?” అడిగారు వామ్.

“అవసరంలేదు ప్రొఫెసర్. బాకు విసిరింది నేను. అతను బాధతో అరిచేడు. మెట్లు దిగేసరికి ప్రాణం పోయింది. అంతకు ముందు ఎవరు వచ్చినా హత్య చేయలేదు” అంది.

“నువు పూర్తిగా బాధ్యురాలవి కావని అనడంలేదు. తోలుపటకాకి ఉన్న బాకులు రెండు. ఒకటి నువ్వు ఉపయోగించేవు. రెండవది మరొక వ్యక్తి ఉపయోగించేరు. అయితే ఆ వ్యక్తి ఆడా, మగా అనే విషయం మనకి తెలీదు. ఎవరి బాకు నాగభూషణం హత్యకి కారణం అయింది అనే విషయాన్ని తెలుసుకోవాలి,” అన్నారు వామ్.

“కారు ఎవరిదో తెలుసుకోవడం ఎలా?”

జవాబుగా వామ్ తలాడించి క్రిందికి వెళ్ళేరు. మాలతి కూడా వెళ్ళింది.

వాన పూర్తిగా తగ్గిపోయింది.

చూరు వెంబడి పడుతున్న ధారలు కూడా నిలిచిపోయేయి.

ఆకాశం నిర్మలంగా, నీలంగా ఉంది. చుక్కలు ధగ ధగ మెరుస్తున్నాయి.

ఫోన్ బూత్ లో ఆగి పోలీసులకి ఫోన్ చేసేరు వామ్.

“యస్... బ్లాక్ కలర్ అంబాసిడర్ MYR 97... అని మొదలవుతుంది.... చూడండి ఇన్ స్పెక్టర్.MYRతో ఉన్న అంబాసిడర్ లెన్ని... ఇరవై ఉన్నయా... అందులో బ్లాక్ ఎన్ని...ఆరు గుడ్...మనం 97తో మొదలెడితే మొత్తం 99 కార్లు ఉంటాయి...ఇప్పుడు చూడండి. 97తో మొదలయే బ్లాక్ అంబాసిడర్ లు ఎన్ని...నాలుగు.

వెరీగుడ్ ... ఇప్పుడు వాటిలో MYR లో ఉన్నవి ఎన్ని...ఒక టేనా...దట్స్‌రైట్, దాని గురించి కనుక్కోండి...ఓనర్ గురించిన వివరాల్తో నా దగ్గరికి రండి" ఫోన్ దించేరు వామ్.

తిరిగి ఇద్దరూ రూమ్‌కి నడిచేరు.

"మాలతీ. ఒకవేళ నువ్వు తెల్లచీర ధరిస్తే ఏ రంగు జాకెట్ వేసుకునే దానివి."

"తెల్లది."

"కలర్ మాచింగ్ స్కీమ్ ప్రకారం, వాచ్ స్ట్రాప్ కూడా తెల్లదే పెట్టుకుని, చెప్పులుకూడా వీలయితే తెల్లవే తొడుక్కుంటావు."

అవునన్నట్లు తలూపింది మాలతి.

"చివరికి తల్లో పూలుకూడా తెల్లవి, అంటే మల్లెలో లేక సన్నజాజులో ధరిస్తావు."

"అవును."

వామ్ తృప్తిగా తలూపేరు.

బయట జీపు ఆగింది.

సబ్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, మరి యిద్దరు కానిస్టేబుల్స్ వచ్చేరు.

"గుడ్ ఈవెనింగ్ ప్రొఫెసర్. నాగభూషణం హాస్పిటల్‌లో మరణించేడు. చనిపోతూ తన్ను హత్య చేసినది మా...అన్నాడు."

అతని దృష్టి మాలతి మీదే ఉంది.

ప్రొఫెసర్ మౌనంగా ఉన్నారు.

"కార్ నెంబర్ ద్వారా ఆ కారెవరిదో తెలుసుకున్నాం. అది మాధవ సిన్హాది" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"జస్ట్ ఎ మినిట్. హంతకుడు మాధవసిన్హా ఎందుకు కాకూడదు?"

రంజిత్ నవ్వేడు.

"ఆ సంగతి మాకు తట్టింది. కాని అతనికి పటిష్టమయిన ఎలిబీ వుంది. పది నిముషాలు ఎవరిదో ఫోన్ వస్తే క్రిందికి వెళ్లేడు. తిరిగి తన రూమ్‌లోనే కూర్చుని సాయంత్రమంతా పేకాట ఆడేడు" అన్నాడు సబ్ ఇన్‌స్పెక్టర్ రంజిత్.

ప్రొఫెసర్ మౌనంగా కిటికీవద్ద నిలబడి టేబుల్ మీద చేతులాన్చి బయటకు చూడసాగేరు. ఆతని దృష్టి టేబుల్ మీద ఉన్న న్యూస్ పేపర్ మీద పడింది. యాధాలాపంగా తీసి పేజీలు మళ్ళించేరు. ఒక పేజిలో ఉన్న ఫొటోమీద ఆయన దృష్టి నిలిచింది.

ఆ ఫొటో మాధవ సిన్హాది. ఎయిర్ పోర్ట్‌లో తీసిన ఫొటోలో ప్లేన్ దిగుతుండగా ఉన్న చిత్రం అది.

ఎడమచేతిలో బాగ్. కుడిచేయి పైకిఎత్తి ఫ్రెండ్స్‌ని సమాశ్వాసిస్తుండగా తీయబడిన ఫొటో అది.

"ఇన్‌స్పెక్టర్ మీరు మాధవ సిన్హాకి ఫోన్ చెయ్యండి," అన్నారు ప్రొఫెసర్.

సబ్ ఇన్‌స్పెక్టర్ సందేహించేడు. మాధవసిన్హా ఈ కేస్‌లో ఏ విధంగా ఇరుక్కున్నాడో ఆతనికి తెలియలేదు.

"ప్రొఫెసర్ మీరు మరో విధంగా భావించకపోతే మీకు ఓ విషయం చెప్తాను. నాగభూషణాన్ని హత్యచేసి పారిపోయిన స్త్రీని ఎదురుగా ముష్టివాడు చూసేడు. తనని చంపినది షా...అన్నాడు హతుడు నాగభూషణం. ఇదిగో ఆ టేబుల్ పైన తెల్లచీర మడిచి వుంది. మాకు ఈ గది గుమ్మంవద్ద నలిగిన మల్లెపూవు కనబడింది. ఇదిగో" అన్నాడు రంజిత్.

"కాని ఆ చీర కాటన్‌ది" అన్నారు ప్రొఫెసర్.

"అయితే."

ప్రొఫెసర్ తన జేబులోని దారపు పోగుని తీసేరు.

సిగార్ లైటర్‌ని వెలిగించి దారపు పోగుని ముట్టించేరు. అది చురచురా కాలింది.

"ఈ పోగు నైలాన్‌ది" అన్నారు వామ్.

"కాని నాగభూషణం వాఙ్మూలం ప్రకారం తనని చంపినది మాలతి. మాధవసిన్హా చంపితే 'తనని చంపిన వాడు' అనేవాడు కాతుడు."

ప్రొఫెసర్ తలూపేరు.

"నాగభూషణం చెప్పే ధోరణి చూస్తే తన్ని చంపినది అంటే స్త్రీ అనే తోస్తున్నది" అన్నాడు రంజిత్.

"కాని ఆ స్త్రీ తెల్లచీర ధరించినది, అయిఉండాలి. పైగా ఆ చీర నైలాన్‌దే అయుండాలి" హెచ్చరించేరు వామ్.

"అదిగో తెల్లచీర."

"మరి మల్లెపూలు" అన్నారు వామ్.

రంజిత్ నవ్వేడు. "మాలతి ఆ పూలను పారవేసి కనకాంబరాలను పెట్టుకుంది," అన్నాడు.

"చూడు ఇన్‌స్పెక్టర్. ఆ చీర మడతల్ని చూస్తే పెట్టెలోనుండి తీసినట్లు కనిపిస్తోందా? లేక పెట్టెలో పెట్టబోతున్నట్లుందా?"

రంజిత్ ఆలోచించేడు.

"మాలతి ఆ చీరని విడిచి, పెట్టెలో పెట్టబోతున్నాది" అన్నాడు.

ప్రొఫెసర్ చిరునవ్వు చిందించేరు.

కొక్కేనికి ఉన్న మరో చీరని రంజిత్‌కి అందించేరు.

"కమాన్ ఇన్‌స్పెక్టర్. ఈ చీరని సరిగ్గా పెట్టెలో ఇమిడే విధంగా మడిచిచూడు. అయితే ఒక షరతు. పెట్టెలో ఉంచి మడచకుండా, ముందు మడచి తర్వాత పెట్టు. చీరమడత పొడవు, వెడల్పు, సరిగ్గా పెట్టెలో ఇమి

దేటట్లు ఉండాలి."

రంజిత్ చీరని మడిచి పెట్టెలో పెట్టేడు. కాని కొద్దిగా పొడుగయింది. తిరిగి చీరని బయటికి తీసి పెట్టెని పరీక్షించి, తిరిగి చీరని మడిచి పెట్టెలో ఉంచేడు. కాని ఈ సారి మడిచిన చీర పొడవు-వెడల్పులు పెట్టెకంటె చాలా చిన్నవిగా వున్నాయి.

తిరిగి రెండు, మూడు సార్లు ప్రయత్నించేడు కాని లాభంలేక పోయింది.

ఈసారి చీరని పెట్టెలో ఉంచి, అది ఇమిడే విధంగా మడిచి పెట్టెలో వుంచేడు.

"అంటే సరిగ్గామడిచిన చీరను పెట్టెలోనే వదిలేయాలి. అట్టి చీరను బయటికి తీస్తే పెట్టె కొలతలతో సరిపోతుంది" అడిగేరు వామ్.

తలూపేడు ఇన్‌స్పెక్టర్.

"అంటే ఈ చీరని అప్పుడే పెట్టెలోనుండి తీసేరు. కాని పెట్టెలో వుంచబోతున్నట్లు లేదు. అవునా?"

తిరిగి తలూపేడు ఇన్‌స్పెక్టర్.

మెట్లమీద ఎవరో వస్తున్న శబ్దం అయింది. అందరిదృష్టి అటువైపు తిరిగింది.

"నేను మాధవస్వామిని. మీరు నన్ను పిలిచేరుట. ఎందుకో తెలుసుకుందామని వచ్చేను" అన్నా డతను.

అతను చాలా పొడుగరి. దాదాపు ప్రొఫెసర్ వామ్ అంత పొడుగు వున్నాడు. నల్లని సూట్, ఈవెనింగ్ కావ్ ధరించేడు. నల్లని బూట్లు తళతళలాడుతున్నాయి.

అతను రూమ్‌లోకి వస్తూ చుట్టూ కలయజూచేడు. ప్రొఫెసర్ వద్దకి నడిచి షేక్‌హేండ్ చేసేడు. కాని ఎడమచేయిని ఉపయోగించి షేక్‌హేండ్ చేసేడు.

ప్రొఫెసర్ దృష్టి కుడిచేయిమీద పోయింది.

"సారీ. కుడిచేయి బెణికింది. నాలుగు రోజుల్నుండి సలుపుతోంది" అన్నాడు మాధవసిన్హా చిరునవ్వుతో.

ప్రొఫెసర్ తిరిగి టేబుల్ మీద చేతులాన్చి కిటికీలో నుండి తొంగి చూసేరు. చూరునుండి కారుతున్న నీటిధార ఆగిపోయింది.

చేతికి టేబుల్ చల్లగా తగిలింది. ఆయన టేబుల్ని చూసేరు. ఆయన దృష్టి టేబుల్ మీద పరుగుతీసింది.

టేబుల్ పైనవస్తువులన్నీ యథాప్రకారంగా నేవున్నాయి. న్యూస్ పేపర్ అలాగే వుంది. ఆయన చటుక్కున పేపర్ తిరగేసి చూచేరు. తిరిగి అందులోవున్న ఫొటోమీద దృష్టి కేంద్రీకరించిపోయింది.

"అవును ఆ ఫోటో నాదే" అన్నాడు మాధవసిన్హా.

"కాని అప్పుడు కుడిచేతికి బెణుకు లేదు" అన్నారు వాఘ్ చిరునవ్వుతో.

మాధవసిన్హా ముఖం వెలవెలపోయింది. కోటు జేబులో నుండి రుమాలుతీసి ముఖం తుడుచుకున్నాడు.

"ఎగ్జాక్ట్లీ. ఆ రుమాలుని టేబుల్ పైనుండి సంగ్రహించేరు. అందుకే రెండవసారి టేబుల్ మీద చేతులుంచిన నాకు టేబుల్ చల్లగా తగిలింది. అంతకుముందు ఉండవలసిన రుమాలు మాయమయింది."

మాధవసిన్హా రుమాలుని జేబులో వుంచుకున్నాడు.

"ఇంతకుముందు మీరు ఈ రూమ్కి వచ్చేరు. అప్పుడు ఈ రుమాలుని మరిచిపోయేరు కాబోలు."

మాధవసిన్హా తలాడించేడు.

తలపైన వున్న ఈవెనింగ్ కాప్ తీసి టేబుల్ పైన వుంచేడు.

ప్రొఫెసర్ తన కాప్తో దాన్ని పోల్చి చూచేరు.

రెండింటి పైన నల్లని మరకలు వున్నాయి.

"మీరు పైనుండి వానబొట్లు పడ్డాయి" అన్నారు వామ్ శాప్ని (వేలితో రాస్తూ.

దీనితో మాధవసిన్హా ఆ రూమ్కి వచ్చేడన్న సంగతి ధ్రువ పడింది.

'కాని ఎందుకు వచ్చేడు?'

ప్రొఫెసర్ క్షణకాలం ఆలోచించేరు. కోట్ జేబులో వున్న వుత్తరాల కట్టని పైకితీసి, "బహుశా దీని కోసం కాబోలు" అన్నారు.

మాధవసిన్హా ఆత్రుతగా ఆ కట్టని అందుకున్నాడు.

"ఆనంద్ సిన్హా మీ కుమారుడా?" అడిగారు వామ్.

అతను తలూపేడు.

"నాగభూషణం మీకు ఈ వుత్తరాల విషయమై ఫోన్ చేసేడా?" అడిగారు ప్రొఫెసర్.

"ఫోన్ చేయడమే కాదు. ఆనంద్ వ్రాసిన ఉత్తరాలు తనవద్ద వున్నాయని, భారతి చనిపోయే సమయానికి గర్భవతి అని, లక్షరూపాయలివ్వని పక్షంలో ఆ ఉత్తరాలు పేపరుకి ఎక్కుతాయని బెదిరించేడు" అన్నాడు మాధవ సిన్హా.

"అయితే మీరు పేకాట ఆపి ఆ పదినిమిషాల్లో ఇక్కడికి వచ్చేరు."

తలూపేడు మాధవసిన్హా.

"మీతో వచ్చిన మరొకవ్యక్తి ఎవరు?"

"నేనొక్కడ్ని మాత్రమే వచ్చేను. నాగభూషణం గదిలో వున్నాడు."

ప్రొఫెసర్ తల అడ్డంగా ఆడించేరు.

"మీతోపాటు మరొకవ్యక్తి వచ్చేరు.ఆ వ్యక్తి ఎవరు?"

5

"అతని తర్వాత వచ్చినది నేను ప్రొఫెసర్."

అందరికళ్లూ అటువైపు తిరిగేయి.

గుమ్మం వద్ద ఒక అందమయిన యువకుడు వున్నాడు.

మాలతి ఆనందంగా "శ్రీనివాస్" అంటూ అరిచింది.

కాని మరుక్షణంలో ఆమె ముఖచంద్రమండలం మేఘావృతమయింది. కారణం శ్రీనివాస్ పచ్చిదొంగ. తనను మోసగించేడు.

"ప్రొఫెసర్ ముందు ఇతన్ని బంధించండి. ఇతనివల్లనే నేను ఇంత దూరం వచ్చి హత్యలో ఇరుక్కున్నాను" అంది మాలతి.

శ్రీనివాస్ మాట్లాడలేదు.

ప్రొఫెసర్ చిరునవ్వు నవ్వి, "ముందు హంతకులెవరో తేలిం తర్వాత అలాగే బంధిస్తాను," అన్నారు.

"మనం కేస్ నంతటిని పరిశీలిద్దాం. నాగభూషణం ముందు మాలతిని కలిసేడు. ఆమెవద్ద ఉత్తరాల ద్వారా మాధవసిన్హాని బ్లాక్ మెయిల్ చేయజూచేడు. మాధవసిన్హా వచ్చే సమయానికి మాలతి హోటల్ కి వెళ్ళింది.

"మాధవసిన్హా వచ్చేటప్పుడు వర్షం చూరునుంచి కారుతోంది. అతని హేట్ మీద పడి మరక అయింది. అతను టేబిల్ మీద రుమాలు మరిచి వెళ్ళిపోయేడు. అంతకు కొద్ది సేపటి తర్వాత నాగభూషణం హత్య జరిగింది. రెండు బాకులూ కొద్ది నిముషాల తేడాతో ఉపయోగింపబడ్డాయి. ఒక బాకు మాత్రమే దొరికింది. రెండవది ఏమయింది?

"అనుమానితులు ఇద్దరు. ఒకరు మాలతి. ఆమె బాకును ఉపయోగించింది. హతుడు చనిపోతూ తన్ను చంపినది మా... అన్నాడు. కాని మా... అంటే మాధవసిన్హా కూడా అవుతుంది."

అందరూ మౌనంగా ప్రొఫెసర్ లాజిక్‌ని వింటున్నారు.

"మాధవసిన్హా చేతికి బెణుకు లేదు. కాని అతను చేయి కదల్చలేక పోతున్నాడు," అన్నారు వామ్.

మాధవసిన్హా ముఖం చెమటలతో నిండింది.

"భయపడకండి. మీరే హంతకులని నే ననడం లేదు," అన్నారు వామ్.

మాధవసిన్హా నిట్టూర్పు విడిచేడు.

"హత్య చేసినది స్త్రీ, అని అనుమానం. కారణం తెల్ల చీర దొరికింది. మాలతి గదిలో తెల్ల చీర దొరికింది. పైగా బాకు విసిరింది మాలతి. హతుడు మరణిస్తూ తనని చంపినది మా... అని ఆగేడు."

ఈ సారి మాలతి ముఖంలో భయం ప్రస్ఫుటంగా కన బడింది.

ప్రొఫెసర్ ఇక కేస్‌ని వివరించడం ఆపి మాలతి, మాధవ సిన్హాల ముఖాలకేసి చూసేరు.

ఈ సారి ఇద్దరి ముఖాలు వెలవెలబోయేయి.

తిరిగి ప్రొఫెసర్ తన ధోరణి కొనసాగించేరు.

"మాలతి బాకు విసరడం ఖాయం. అయితే అది నాగ భూషణానికి తగిలిందా? లేక..." ప్రొఫెసర్ ఆగి మాధవ సిన్హా కుడిచేతిని నొక్కేరు.

మాధవసిన్హా బాధతో ఆహ్... అని మూలుగేడు.

మాలతి ముఖం విప్పారింది.

"అతడే... మూలిగేడు" అంది.

"కరెక్ట్. అంటే మాలతి విసిరిన బాకు మాధవసిన్హాకి తగిలింది. మరి నాగభూషణం ఎవరిచేతిలో చనిపోయేడు. అతన్ని చంపినవారు స్త్రీ అని, తెల్ల చీర ధరించినదని,

మల్లెపూలు పెట్టుకొన్నదని, పేరు మా...తో ప్రారంభ మవుతుందని తెలుస్తోంది?''

''ఇంతకీ మాధవసిన్హాగారు క్లబ్ లో ఉన్నట్లు నాగభూష ణానికి ఎలా తెలిసింది. ఎవరు ఫోన్ చేసేరు? చేసినది ఆడా? లేక మగా? ఫోన్ చేసిన వ్యక్తి ఈ రూమ్ కి వచ్చి ఉండాలి. అయితే ఆ వ్యక్తికి నాగభూషణాన్ని హత్యచేసే అస్కారం ఉంది. ఎవరా తెల్ల చీర ధరించిన స్త్రీ?'' అడిగేరు వామ్.

''నేను ప్రొఫెసర్, మాధవిని. అతనొక బ్లాక్ మెయిలర్. నా జీవితంతో చెలగాట మాడేడు. ఆ బ్లాక్ మెయిలర్ ని కత్తితో బెదిరించబోయేను. కాని మరణించేడు'' అందా యువతి.

అందరి దృష్టి క్రొత్తగా అడుగుపెట్టిన యువతి పైకి తిరిగింది.

ఆమె తెల్లచీరలో ఉంది. ఆమె మాధవసిన్హా కుమార్తె మాధవి.

మాలతి హాయిగా నిట్టూర్పు విడిచింది. ఆమె దృష్టి శ్రీని వాస్ పైన పడింది.

''ప్రొఫెసర్ ఇతడ్ని అరెస్ట్ చెయ్యండి,'' అంది మాలతి.

ఈసారి ప్రొఫెసర్, శ్రీనివాస్ ఇరువురూ నవ్వేరు.

''అతను బెంగుళూరు క్రైం బ్రాంచ్ లో బెస్ట్ బోయ్. ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్,'' అన్నారు వామ్.

మాలతి తన చెవుల్ని తానే నమ్మలేక పోయింది. అందరూ ఒకరి తర్వాత ఒకరు నిష్క్రమించేరు.

శ్రీనివాస్, మాలతులు ఇద్దరే మిగిలేరు. మాలతి సందే హంగా అడిగింది.

''ఆ పదివేలు...''

‘‘ఆ కేడీని పట్టుకున్నాను. నెల రోజులుగా కేస్‌లో షాటేజ్ వస్తోంటే నిఘా వేశాను. చివరకి దొరికేడు,’’ అన్నాడు శ్రీనివాస్.

‘‘మరి ఆ రోజు... గార్డెన్ దగ్గర కేడీ మిమ్మల్ని చూసి ఎందుకు నవ్వేడు?’’

ఫకాలున నవ్వేడు శ్రీనివాస్.

‘‘ఎందుకంటే వాడు నా జైల్లోంచి వచ్చేడు. ఆ రోజు నే నాడిన నాటకంలో సహాయం చేసేడు,’’ అన్నాడు శ్రీనివాస్.

—: అయిపోయింది :—